

## ముఠా మేస్త్రీ

''నీ మాటలు వింటుంటే నువ్వు తోడుదొంగల మధ్య వున్నావనే అర్థమౌతున్నది. వారికో ముఠా మేస్త్రీ వుండాలే'' అన్నది హాస్యప్రియ.

''వున్నది. ఆమెకి స్థానబలిమి వున్నది. స్థాన బలిమి కాని తన బల్మి కాదయా అన్నాడు కవి. నీళ్లలోన మొసలి నిగిడి యేనుగు బట్టు బైట మూరెడైన బాకలేదు. మనుషుల తత్త్వమే జలచరానికి భూచరానికి అంటగట్టాడు కవి. ఆ కవిత ఫిక్షన్ అంటాను నేను'' అన్నది దయావతి.

''మేస్త్రీ స్త్రీయే!'' హరి ప్రియ ఆశ్చర్యం అభినయించింది. చిన్నతనంలో కూచిపూడి నేర్చింది హాస్యప్రియ. దయావతి నవ్వి, ''గజ్జ కట్టావా? అరంగేట్రం జరిగిందా? పండితులేమన్నారూ? భేష్ అన్నారా? ప్రోగ్రామ్స్ యివ్వచ్చు అన్నారా? నేడు తెరంగేట్రం చేసేవారు స్క్రీన్ టెస్టు నెగ్గాలి. జగదేక సుందరి పోటీకెళ్లేవారు రిహార్సులో నెగ్గాలి''.

''నా సంగతి తరవాత చెప్తా. ముందిది చెప్పు. మేస్త్రీ యింట్లో నువు పాదం పెట్టలేదని వినికిడి. మీ సివిల్ వార్లో కొన్ని సెన్సార్ చేయబడిన లేఖలు నా కంటబడ్డాయి, ప్రమాదవశాత్తూ. అంటే చెత్తబుట్టలో దొరికాయి. ''నీవు పాదం పెట్టినప్పటినించే మా అబ్బాయి డౌన్‌ఫాల్ ఆరంభమైంది అని హిడింబాసురుని చే వ్రాలున్నది బట్వాడా చేసేప్పుడే పోస్టుమానుడు సెన్సార్ చేశాడేమో. అలా వ్రాయించింది మేస్త్రీయేనని లోకులు కోళ్లై కూశారు. కొన్ని కోళ్ల కా ప్రళయలేఖలు రుచిగా వుండి గోళ్లతో గీరి తినేసినై. పాదంపెట్టి మేస్త్రీని గుర్తించావా, లేక మేస్త్రీయే నీవున్న చోట పాదం పెట్టినప్పుడు కనిబెట్టావా?'' అన్నది హాస్యప్రియ.

''నీవన్నవి రెండూ జరిగాయి'' అన్నది దయావతి.

''యేది ముందూ? యేది వెనకా?'' కుశ్శంక లాగా బైటపెట్టింది హాస్యప్రియ.

''మగ మేస్త్రీకి, ఓపిక లేక, డబ్బూ లేక, నమ్మికాలేక, యాత్రల బాదరబందీ పెట్టుకోకుండానే పరమపదం చేరాడు. స్త్రీ మేస్త్రీ సనాతనాన్ని గౌరవిస్తుంది. గుండు కొట్టించుకు, సైను కట్టి, ఉత్తర భారతం, దక్షిణానా అన్నీ యాత్రలూ చేసి పెద్ద మడుగులాంటి యింటికి చేరింది. శరీరం మొరాయించి మంచమెక్కించింది. శరీరంతో పోరాడింది మేస్త్రీ. వింటర్ ఎక్విప్‌మెంట్సూ లేవు. ఓవర్ కోటూ లేదు. అందిన ఆహారము తినలేదు ఔషధమూ లేదు. ఉక్కు శరీరమని భ్రమపడ్డావు అన్నది శరీరం. ప్రాణభీతి లొంగదీసింది తోడుదొంగ కొడుకు వద్దకు వచ్చింది మేస్త్రీ''. ''ముఠాలో యింకా దొంగలున్నారే వీడి స్పెషాలిటీ యేమిటి?'' ''ముఠాలో యింకెవరూ హెల్తాఫీసర్లు లేరు. వాళ్ల హెల్తే అంతంత మాత్రం, ఛాన్సు రాగానే మంచమెక్కుతారు. మేస్త్రీయే వారికి గృహవైద్యం , నాటువైద్యం, ఆయుర్వేద వైద్యం చేసి కుదురుస్తుంది తన రోగం కుదర్లా? ముచ్చటలాడుతూ, తోడుకోడల్తో మాట్లాడుతున్నట్టు తనను గురించే ముచ్చటిస్తుంటే ''వీళ్లు తోడుదొంగలు వీరికామె మేస్త్రీ అయి వుండాలి'' అనుకున్నా.

హాస్యప్రియ ''కొన్ని ముచ్చటలు చెప్పు ప్రియతమా. తోడికోడల్తో చెపుతున్నట్టని యెందుకు వాడావో తెలుస్తుంది'' అన్నది.

''చెప్తా. చెప్తా. మై ఫ్రెండ్. నీకు బోర్ కొట్టచ్చు. అభినయించనా? మేస్త్రీ అభినయిస్తూనే ముచ్చటలాడింది''.

''అభినయిస్తునే చెప్పు యెంజాయ్ చేస్తా'' అన్నది హాస్యప్రియ.

''సీనియర్ కోడలేమో మేనగోడలే. మూణ్ణాళ్ల పండగలో మూడు రోజులూ కాదుట. ఒక రోజే పిసరంత అయి ఆగిపోతుందిట. చింత పిక్క రంగులో అవుతుందిట. మూల కూచోటం దండగ అంటుందిట. ముద్దుల మనమరాలేమో, తలంటి పోయించుకోదుట. తల్లి కందదుట. ఇటూ అటూ పరుగెత్తుతుందిట. తానే తన కబంధహస్తాలతో పట్టేస్తుందిట మనమరాలిని. మనమరాలేమో వంగుని ''నీళ్లు పొయ్యి'' అంటుందిట. నూనె గిన్నె తెచ్చే లోపల

పారిపోతుందిట. తొంగి చూస్తుందిట. ముద్దుల మనమడు నూగారుతూ బావున్నాడని చూస్తుంటే, యేదో పెట్టుకొచ్చి బక్క పీరులాగా అవుతాడుట. యెముకల గూడు అవుతాడుట పెద్ద మనమడికప్పుడే సంబంధాలొస్తున్నాయిట. అమ్మా! వాడికి పదమూడో యేడు. అసలు వాళ్ల తాతగారుండగానే ఆ వేడుక చేతామనుకున్నాము. మా కాలంలో పెళ్లకొడుకుకి తొమ్మిదో యేడు పెళ్లి కూతురుకి అయిదో యేడు. అంతే. అంతెత్తు పిల్లని, వంటినిండా నగలు దిగేసి యిస్తామన్నారు. అంత పిల్లవాడికెందుకూ అన్నా''. నేను, బ్రేక్ వేసి ప్రియా! ''బాగా పట్టేది. వీరేశలింగం పంతులుగారికి పదమూడవయేడే పెళ్లినాటికి, పెళ్లికూతురికి పన్నెండు. పధ్నాలుగో యేట వచ్చింది అత్తింటికి. చెప్పించుకోకండా పని చేస్తుంటే అత్తగారికి ముద్దు వచ్చి, బాపాయమ్మ అనేపేరు మార్చి కోడలికి ''రాజ్యలక్ష్మి'' అని పేరు పెట్టి, యింటికి లక్ష్మి వచ్చిందన్నదిట'' అన్నా. తీసి పారేసినట్టు చేయితిప్పి మేస్త్రీ ''మాకేం చేయక్కర్లా. వాళ్ల దోవన వాళ్లే వుంటారు'' అని కసిరింది. తోడుదొంగ ఎంగేజ్ చేసిన వంటోడు బలరామ్ యికిలిస్తూ తానూ వినేవాడు మేస్త్రీ ముద్దులు.

''తన ముద్దులతోడు దొంగ అల్లునికి నాజూకులు తెలియవుట. అగ్రహారీకులుట. గర్భం తేవటమే వాడివంతుట. మేము వెళ్లి మూడో నెలలో నా కూతుర్ని పురిటికి తేవాలిట. విరహమోర్వలేక తాను వస్తూ వుంటాడుట. వచ్చినప్పుడు పాలాలున్న ఆసామీ అని బ్రహ్మరథం పట్టాలిట'' అంటున్నది మేస్త్రీ.

నేను మళ్లా బ్రేక్ వేశా ''మరి మీ హెల్తాఫీసర్ మాటేమిటీ?''

''ఖర్చులన్నీ మావేగా'' అని దీర్ఘం తీసింది మేస్త్రీ.

''పగలు మూడుసార్లూ రాత్రి మూడు సార్లూ కావాలంటాడు. అది నాజూకా?''

''యేమిటి కావాలంటాడూ?'' అని మేస్త్రీ అమాయకంగా అర్థంగానట్లు చూసింది.

''అదే అగ్రహారీకుడడిగేదే'' అంటే తలతాటించి మూతివిరిచి పెదిమలు

విరిచింది మేస్త్రీ. అదుగో అప్పుడే ఈమె ముఠామేస్త్రీయే అని రూఢి అయింది'' అన్నది దయావతి.

''యెలా?'' అన్నది హాస్యప్రియ.

''చెప్తున్నాగా మిత్రమా తానే ఋజువు చేసింది మేస్త్రీ''.

''మావాడు నాతో మాటమాత్రం చెప్పలేదు. నేను ''యిదేమిత్రా వాసూ! నీకిదేం బుద్ధి? నీమీద యిన్ని నిందలేమిటీ? దాని కోసం వెళ్తున్నావా? అది నీ బుజాల మీదికెక్కి దిగదుటగా! దాన్ని పెళ్లాడు తావాయేం? దాని తండా తండా అంతా వస్తారు. తండాకి నేను వండి వడ్డించాలా? తండా చేతి వంట నే తినను. వారున్నదాని పేరు గూడెం. కులభేదం లేదు సరిగదా సీసాలు తెచ్చుకుని ఆడామగా అంతా సేవిస్తారు మగాడింటికి రావటమే తరవాయి. బైరాగి ముండలల్లే వాడిమీద బడతారు. ఆచారం నాస్తి. అన్నీ యింట్లో కలుపుకోటమే. మొగుడుపోతే జుట్టు తీయించుకోరు. జుట్టున్న ముండను వంటలక్కగా పెట్టుకుంటారు'' అంటుంటే తోడుదొంగ హిహీ అంటూ, ''అదే నా మీద బడింది. పాపం నా మీద మోహం కలిగింది. పొందుకోరుచున్నది. మనదేం పోయింది? దీని మోహం తీరుస్తా. పరోపకారార్థ మిదం శరీరం అన్నారు'' అని దొంగ నవ్వు నవ్వుతున్న దొంగమీదికి పోయిందిట మేస్త్రీ ''యెవరమ్మాయిరా దొంగా?'' అంటుంటే ''నువే చెప్పావు'' అని పారిపోయాడుట ''చెప్పనే లేదు'' అన్నది మేస్త్రీ.

''యేమిటి చెప్పలేదు? హైదర్‌బాద్ నవాబు, తన కొడుకు నది దాటి అవలి ఒడ్డుకెళ్తున్నాడని గమనించి, ఆపాలని, ఆ రాత్రి నదిలో నావ లేకుండా చేశాడట. కాని కొడుకు, ఆ రాత్రి నావ లేకుండానే నదిదాటి ఆవలి ఒడ్డుకి వెళ్లి వచ్చాడు. తండ్రి నిలేశాడు.

''యెందుకు వెళ్తున్నావు? నది పొంగే రోజులు. ప్రమాదం గాదూ'' కొడుకు చెప్పేశాడు. '' ఆవలి ఒడ్డున అమ్మాయి వున్నది, తీయగా పాడుతూ ఆడుతుంది. అది చూడటానికీ వినటానికీ వెళ్తున్నాను''. కొడుకునాపలేనని గ్రహించాడు తండ్రి నవాబు.

''మతం మారి మన మతం పుచ్చుకుంటుందా? పుచ్చుకుంటానంటే యింటికి తీసుకురా మన మతాచార ప్రకారం పెళ్లిచేస్తా''.

అమ్మాయికి పద్దెనిమిది. అబ్బాయికి ఇరవై మూడు. అమ్మాయి మతం మారి యిస్లామ్ స్వీకరించి హైదర్‌బేగం అనే పేరుపెట్టుకున్నది. మొదటి పేరు భాగామతి. అదే భాగ్య నగరం. తరవాత హైదరాబాదే అయింది. హైదర్‌బేగం రాకతో సిరియెత్తుకున్నదని గమనించాడు నవాబు. మీరు నవాబు ఔదార్యం చూపక గెంటేస్తానన్నట్లు మాటాడరేమో'' అని నేను సరసమాడితే, '' ఆ దొంగ అన్నీ కల్పించి చెప్పి వుండాలి. నువ్వు నమ్మావు. నువయినా వచ్చావు గావు. దొంగాడి దొంగబుద్ధి బాగాలేదని పుస్తెలు కట్టించేదాన్ని. మీరిద్దరూ తోడుదొంగలు'' అన్నది మేస్త్రీ.

''తోడుదొంగనడిగితే, ''నువ్వేమంటున్నావంటే స్టుపిడ్, మా అమ్మను పెళ్లాడుతానంటున్నావు'' అని నవ్వి ''సుఖంగా వుండలేవూ? డేంజర్ని ఆహ్వానిస్తావా'' అని అదే పోకపోయినాడు. వండుకున్నమ్మ తినకమానుతుందా, కడుపుతో వున్నమ్మ కనకమానుతుందా అన్నట్లయింది నా పరిస్థితి'' అంటే మేస్త్రీ అర్ధంగానట్లు పోజుపెట్టింది.

ఒక ఫేమస్ యాక్టర్ ఒక స్త్రీని తెచ్చుకున్నాడు. ఆ స్త్రీ లక్షలాది రూపాయలు ఆయన పేరు జెప్పి, ఆయన అధికారం వాడుకుంటూ, కలెక్టు జేస్తున్నదని నిందమోపారు. ''ప్రూవ్ దట్ షి కలెక్ట్స్ లాక్స్ ఆఫ్ రూపీస్, ఐ షల్ త్రో హెర్ అవుటాఫ్ మై లైఫ్'' అని ఛాలెంజ్ చేశాడా ఫేమస్ యాక్టర్. అదీ యాక్షనే. అదీ నటనలో ఒక భాగమమే ప్రియా అలాగే యీమే స్త్రీ.

మొత్తానికి వ్యాధులు వెనక్కిపోయి బలము వచ్చింది మేస్త్రీకి. ప్రయాణం నిబద్ధి అయింది.

''మేం రోజూ బొప్పాయి కూర తినం. యెప్పుడన్నా కాబేజీతో కలిపి పప్పువేసి వండి వార్చి, తాలింపులో కొబ్బరి తురిమి, అదీ చల్లి, బొప్పాయి కూర అని తెలియకుండా పెడతాము'' అన్నది మేస్త్రీ.

వంటోడు బలరాం, ''బాబు యేమి వండమంటే అదే వండుతా బామ్మగారూ. అమ్మ చెప్పే అవకాశమూ లేదు. నేను వండేదీ లేదు. మీరొచ్చారని నన్ను పెట్టారు'' అన్నాడు యికిలిస్తూ.

''నేను నీకు బామ్మనా? నువ్వు నాకు మనవడివా?'' అని లేచిన హిడింబిని చూసి వంటోడు బలరాం నోటీసివ్వకుండా పారిపోయాడు.

ప్రయాణమై ''నా మనవడి పెళ్లికి నువు రావాలి అన్నీ నీ చేతిమీదిగా జరగాలి'' అని విశాలంగా నవ్వింది ముతా మేస్త్రీ.

''యెలా వస్తాను? తోడుదొంగ తన వెంట రానివ్వడు. ''డబ్బు పారేస్తాను వెళ్లిరా'' అంటాడు. కూడా వస్తే చూచిన వాళ్లంతా '' ఈ బిచ్ నేనా నువు సపోర్ట్ చేస్తున్నావు? ఏం చూసి చేస్తున్నావు? అందమా చందమా? అద్భుత సౌందర్యమా? చదువా?'' అని పేలితే, నేనక్కడే నేలకూలి యేడుస్తూ ''అయ్యో! నేనెంత కురూపినో? దేవుడు నన్నెందుకిలా సృష్టించాడో'' అంటానుట.

''ముతా మేస్త్రీ తల తాటించి నమ్మనట్లు చూసి వెళ్లిపోయింది ప్రియా'' అన్నది దయావతి.

''వండర్ ఫుల్!'' అని చప్పట్లు కొట్టి, ''మరి, పాదం పెట్టానన్నావు. ఆ ఎపిసోడూ చెప్పాలి'' అన్నది హాస్యప్రియ.

2

హెల్తాఫీసరు భాగస్వామినై బండిలాగుతున్నా. హెల్తాఫీసరుకి ప్రాణం విసిగాక ప్రమోషనిచ్చి రాయలసీమ వేశారు, పై ఆఫీసర్లు. ఆ ఆఫీసర్లలోనూ తోడుదొంగలున్నారని తేలింది తరవాత. అద్దె యిల్లు ఖాళీ చేసి తట్టా బుట్టా కట్టుకుని, పిల్లా మేకాతో బయలుదేరాము. దోవలో నే ముతా స్త్రీ వూరున్నది. చాలా మంది తోడుదొంగల హైడౌట్ అది. ఫార్మల్‌గా దిగిచూసి పోదామన్నాడు అర్ధరాత్రి ఒకటిన్నరకు దిగి అద్దెకారులో హెల్తాఫీసర్ స్థావరానికెళ్లాం. తట్టా బుట్టా గూడ్సు ట్రెయిన్లో వెళ్లాయి గమ్యానికి. ఇంట్లో లైట్లు వెలుగుతున్నాయి.

అంతా మేలుకునే వున్నారు. ఆసీనులమైనాం. ముతా మేస్త్రీ తరవాత అవకాశం రాదేమోనన్నట్లు, వ్యాకులపాటు, లేదని అభినయిస్తూ తన యంగెస్టు తోడుదొంగను గురించి జాలిగా దయనీయంగా చెపుతూ అందర్నీ ఆకర్షించింది.

''హఠాత్తుగా పట్టుబడిన నా బిడ్డను జైల్లోకి తోసి, అన్నం నీళ్లూ అందకుండా చేశారు, జైలు అధికారి పైవాడి మెప్పుకోసం. సన్నగా చీపురుపుల్లలాగా అయి ప్రాణా వశిష్టుడైన వాడికి బిస్కెట్ల పొట్లాలు చల్లని మంచినీళ్లు యెవరికీ తెలియకుండా పట్టుబడకుండా అందించాడు. వాడి రెండో అన్న. వాటితో బతికున్నాడు విడుదలయేదాకా. చుప్పనాతులూ తోడుదొంగలూ అయిన బంధువులు వాడికి రహస్యంగా అందుతున్న సంగతి జైలు అధికారి మెప్పుకోసం అధికారికి చెప్పారు. జైల్లో చావకుండా బతికున్నాడే అని కడుపులో మంట. దాంతో జైలు అధికారి వుగ్రుడై ''నిన్ను జైల్లో పెట్టిస్తా. నా తడాఖా తెలియదు గాబోలు. చూపిస్తా'' అని పళ్లు పటపటలాడిస్తే, అన్న, ''నా నేరం ప్రూవ్ చేయాలి. నా జోలికొస్తే నిన్నే జైల్లోకి తోస్తారు పాలకులు. నోరు హద్దులో పెట్టుకో. నేను ఆర్మీలో ఆఫీసర్ని'' అని నవ్వుతూ బెదిరించి పారిపోయాడు అన్న'' అని కళ్లద్దుకున్నది. తరవాత తన బిడ్డలపై తన కడుపునిండా వున్న ప్రేమ, త్యాగమూ చెప్తూ ''అందరూ ఆఫీసుకీ బళ్లకీ వెళ్ళాక వుత్తరమొస్తే అందులో యేమున్నదో తెలియక అన్నం విస్తరి వదిలివెళ్లేదాన్ని. వుత్తరం చూపుతూ, ఇది చదివి దీనిలో యేముందో చెపుతారా'' అని తిరిగేదాన్ని. ఒక బంధువు వచ్చి ''నీ కొడుకును అరెస్టు చేసి యీ వూరు మీదుగా తీసికెళ్తున్నారని విని స్టేషన్కెళ్లాం. నా కొడుకు, ''మా అమ్మ రాలేదా? నా కేమీ తినటానికి తేలేదా?'' అన్నాడని చెపితే కడుపు తరుక్కుపోయి ఆనాటి రాత్రినించే రాత్రిళ్లు అన్నం మానేసి, తల్లిగా ఏమీ చేయలేకపోయినాననీ, రెండు మినపరొట్టెలు పరమాన్నం ఒక అరిటిపండు తింటున్నా'' అన్నది.

కొత్తకోడలు లాక్కెళ్లి మేడమీద గదిలో డబుల్ బెడ్ చూపి, '' ఇక్కడ మీ అబ్బాయి పడుకుంటారు'' అని నవ్వింది.

యెలాగైతేనేం నిద్రించటానికి పర్మిషనిచ్చింది మేస్త్రీ తెల్లారింది. ఇంట్లో పసిపిల్లలు కలుపుగోలుతనం, పూసుకు తిరగటం ప్రదర్శించారు'' అన్నది దయావతి.

''యెలా?'' అన్నది హాస్యప్రియ నవ్వుతూ.

''అత్తగారూ, బామ్మా, మామ్మా, అమ్మయ్యా, దొడ్డా అని పిలిచారు. స్నానం కానీయమని తొందరించారు. పిల్లలకు నీళ్లు పోయాలిట. జడవేయాలిట. మేస్త్రీ చెప్పిందిట. సీనియర్ కోడలు కూతురు జడవేయాలిట. ఆ పనికాకముందే కాఫీ ఫలహారాలు చేయమని హుకుం''.

'' ఆమె చేయదా?'' అనడిగా సీనియర్ని చూపుతూ ఆమెకూ అలవాటైందేమో దొంగ నవ్వు నవ్వి వెళ్లిపోయింది.

మేస్త్రీ నవ్వుతూ '' ఆమె కవన్నీ రావు. రోగిష్ఠి. పెద్దదైంది'' అన్నది.

''కోడలు చేస్తుంది. పట్నం అమ్మాయేగా'' అన్నా.

''నా మనవరాలు చిన్నపిల్ల దానికింకా అన్నీరావు. నీవు చాలా రకాలు రుచిగా చేస్తావులే. లేచిరా'' అని పురమాయించింది. జడవేయించుకున్న అమ్మాయేమో గదిలో కెళ్లి తలుపులేసుకుని వదిన చేత జాడ విప్పించి వదులుగా వేయించుకు వచ్చింది.

పొద్దుటి యజ్ఞం అవుతూనే వంట మొదలు పెట్టింది మేస్త్రీ. సీనియర్ దొంగ తలారా స్నానం చేసి పిడపవేసుకుని పట్టుచీర రవికతో పప్పు రుబ్బటానికి వెళ్లింది. తోడు దొంగ వచ్చి వళ్లంతా కదిలించుకుంటూ'' అలా స్నానాలు చేయకు ఆ గుడ్డలతోనే పప్పు రుబ్బు'' అని మా అమ్మ చెప్తుంటే తానెంత ఆచారవంతురాలో, పనివంతురాలో నలుగురికీ తెలియాలని వదినే ఆయాసపడుతూ చాదస్తంగా స్నానం చేసింది'' అనేసి వెళ్లిపోయాడు.

పప్పు రుబ్బే తోడుదొంగ గొణిగింది. '' ఆ తోడుదొంగను నమ్మకు'' ముతా మేస్త్రీ తడిబట్టతో వచ్చి యెసట్లో బియ్యం పోస్తూ ''నాకు పనికిరాదు'' అన్నది.

తుంచి వుంచిన గోరు చిక్కుడు ముక్కలు, గిన్నెలోకి తీసిన వెలగపండు గుజ్జు, నీళ్లు చిలకరించి తీసుకెళ్లింది. మళ్లా వచ్చి ''నువ్వలా చెప్పుల కాళ్లతోనే అన్నం తిననిస్తావుగానీ, నేనూ వూరుకోను. స్నానం చేయాల్సిందే. పట్టుబట్ట కట్టాల్సిందే'' అన్నది.

''నా అధికారం సాగుతున్నట్టు భ్రమ కలిగిందేమో మీకు'' అన్నా. కూరలు కడిగి పులుసు ముక్కలు తరిగి పళ్లెంలో వుంచా. అవధాన్లగారొచ్చి పూజ చేస్తారుట. హాజరు కావాలిట. ఒక మధ్య వయస్కురాలొచ్చి కూచుని నన్ను చూసి, ''మీ అక్క కూతురు నువ్వొచ్చి చూసిపోవని కళ్లనీళ్లు పెట్టుకుంటుంది'' అన్నది నేయి అప్పుకావాలిట గిన్నె అక్కడుంచింది. నెయ్యి తెచ్చి గిన్నెలోకి వంచుతూ మేస్త్రీ అన్నది, '' ఆవిడందరిలోకీ పెద్దది. నా మనమరాలికి నాలుగు నెలలూ వెళ్లినై. ఆమె చేతిమీదుగా అన్నీ జరగాలి. మంగళారతులు నేర్చుకున్నా'' అన్నది నేయి అందుకుని చుట్టం వెళ్లిపోయింది.

అలా వళ్లు హూనమవుతూండగానే మేస్త్రీ పరాచికాలాడింది. సహజగుణరామా అనే పాట లాగా ఆ పరాచికాలతో ముఠా మేస్త్రీ సహజగుణం బైటికొచ్చింది. పై పూత చెరిగిపోయింది. మొహాన మాస్క్ వూడిపోయింది. నీటిమీద నూనె తేలినట్టు తేలినై. కడుపులో లేనిది కావిలించుకుంటే వస్తుందా బలవంతుడు పైకొనిరాగా వంగినవానికి మేలగును అని సూక్తి. ముఠా మేస్త్రీ, పైగా స్థానబలిమి అని పస్తాయించా. అనుయాయులూ వున్నారు మేస్త్రీకి. పారిపోదామా అనుకున్నా. చివరికి హైడ్రామాలో పాల్గొనాల్సి వచ్చింది. తోడుదొంగ ఛార్జి తీసుకుని వచ్చి తీసుకువెళ్తానని వెళ్లాడు. మేస్త్రీకి మరీ స్వేచ్ఛా పుట్టింటారు వచ్చినప్పుడు, ''మన ముఠాలోదే. మన ఆచారాలు నేర్పుతున్నా'' అన్నది.

తోడు దొంగ, ''మీ ముఠావాళ్లను చూసి వచ్చావా?'' అన్నది. ''లేదండీ'' అన్నా కాకరకాయలు ముక్కలు తరిగి, కొబ్బరి కోరి, దోసకాయ చెక్కు తీస్తున్నా పులుసులోకి, ముక్కల పచ్చడి విడివిడిగా పళ్ళెంలోకి తరగాలి.

''నే చూసి రమ్మనే అన్నా'' అని తన నిర్దోషిత్త్వం వెల్లడించింది మేస్త్రీ.

''మీరందరిదీ యీ వూరేగా? చూసి రావూ? గర్వమనుకోరూ? నీ పెత్తల్లి కొడుకు పొట్టి సుబ్బులు విశ్వబ్రహ్మలమ్మాయి విడోని తెచ్చుకున్నాడు. మెట్రిక్కి వెళ్తొందిట. ఖర్చులు తనవేనంటుందా స్టూడెంటు. వంటినిండా నగలూ'' అన్నది. తమాషాగా కనపడకుండా దొంగ నవ్వు నవ్వుతూ. అది హేలే.

ఇలాంటి దొంగ నవ్వు అలవాటయింది నాకు. ఇట్టే గుర్తించగలను ''అనుకోరు. సందుదొరికిందని, ఇహిహీ అంటూ పురాణవైరం కెలికి, ''యెలా వెళ్లావే ఆ ముఠాలోకీ ముఠాలు వేరుబడి మూడుతరాలాయె బిడియమెందుకు రా అన్నారా?'' ''అనరా వురి గెజెటెడాఫీసరు స్త్రీవైపాయె. లప్ప బావుకుందామనేమో'' అని హేల చేస్తారు. ఆఫీసరేమో ''దోవలో దిగి చూసిపోదాం'' అని దింపి యెటో వుడాయించాడు. సరిగా చూస్తే అంతా ఒకటేనండీ'' అన్నా.

''అన్ని పన్లు అందుకుంటున్నది. కాఫీ బొచ్చెలు కడగవోకు. దొడ్లో పాకలేసుకుని వున్న యానాదులు కడుగుతారు'' అంటే నవ్వుతుంది. ''మీకు పనికిరాదేమో. అది కడిగి బోర్లించిన బొచ్చెలన్నీ మళ్లా కడగద్దూ? అలాగే వాడుకోమే'' అంటుంది.

మేస్త్రీ బూందిలడ్డు చేయటానికి పిండికలిపి బూందీ పాకం పడుతున్నది. తల వెనక్కు వాల్చి నవ్వుతూ అన్నది. వచ్చినామె వెళ్లిపోయింది.

''నీకు మడి మైలలు లేవు. అన్నీ యింట్లో కలుపుకుంటున్నావు. వంశ నాశనం. అయిపోయిందేదో అయిపోయింది గానీ యిహనైనా పాటించాలి. ముఖ్యంగా నా యింట్లో. మహాపట్నంలో యేమోగానీ, అగ్రకులాచారం పాటించరేమో గాని, అయినా ముంబాయిలో వున్న నా పెద్ద చెల్లి మనమరాలు పాటించటం లేదూ? ఇక్కడ కలిపేశావు. తల అడుస్తుంది'' అంటున్నది. పాకం వచ్చింది. దాన్ని దింపి సన్నసెగన కుంపటి మీదుంచింది మేస్త్రీ. బాండీలో నేయి పోసి పొయ్యి మీదెక్కించింది. మరో పొయ్యి మీద వంటవుతున్నది.

వచ్చినామె కనుబొమ్మలెగరేసి తల విసిరి ''రానిచ్చారే!'' అన్నట్టు నవ్వికూచున్నది పీటమీద.

నాకు రగులుకుపోతున్నది. వారి ముతా ఆమెను గుర్తించా. ''చూశారండీ. విన్నారా? నాకు చేసేవారేరీ? వెలిగాక వైరంగూడాను అందరితో. ఆఫీసరుగారి తల్లిగారొచ్చారా సలసలకాగే జరం. కాశీమలేరియాట. కడుపులో మంటట. ఇంతలేసి భేదులట. వాంతులట. నాకు నాలుగో రోజు స్నానం. ఆఫీసరేమో దొంగ నవ్వు నవ్వుతూ, '' ఆ డ్రమ్ములో నీళ్లు నెత్తిన కుమ్మరించుకుని రా. మడి చాలు. వంటోణ్ణిపెట్టాగా. వాడురాకముందు, యింట్లో కెల్లి నీళ్లు కాచుకుని ఆయల్‌బాత్ తీసుకో. నేను గుమాస్తానా? జీతానికి కుదుర్చుకున్న నౌకర్నా'' అన్నారండి. నమ్మరేమో మరో విచిత్రం. నెప్పులు రాగానే ఆస్పత్రాలుకి పరుగెత్తేదాన్ని, డెలివరీ కానిచ్చుకుని, వాళ్లు పెట్టిన నాన్ రొట్టె తిని టీ తాగి, యిచ్చిన మందు తాగి, బిడ్డసంగతి వాళ్లేచూసేవాళ్లు, అది మిషనరీస్ ఆస్పత్రాలు, పదకొండోరోజున అక్కడే నీళ్లోసుకుని పొత్తిళ్లలో బిడ్డనుంచుకుని యింటికొచ్చేదాన్ని. మళ్లా వేడినీళ్లు పెట్టి తలంటి పోసుకుని బిడ్డకు పోసేదాన్ని. మలేరియా తో తల్లి, మతి చెడి అప్పా, సోమరి అన్నా. యెవరి మీదన్నా అరిచే అధికారం లేకుండా చేశారు నన్ను. అదంతా ఆఫీసరు దయే. యెంతలోకువైనాను? అన్నీ అందుబాటులో బెట్టి చెక్కలెత్తి దొడ్లోపోసి కోరం కడిగి మూలవుంచుతుండగా, కొత్తగా వచ్చిన దొంగ ''అదేం అవస్థ'' అన్నదేకంగా.

ముతా మేస్త్రీ యేమో బూంది ఓడ్చి పాకంలో పోస్తూ ఔదార్యం వెల్లడయేట్లన్నది ''నేనప్పుడే చెప్పా శేషమ్మను తెచ్చి నా దగ్గర దింపిపో. బాగానే చూస్తా. పనిమంతురాలంటివి. దొడ్లో పాకలో వుంటుంది. యెవరడగొచ్చారు'' అన్నది. వంట చేస్తున్నది. పూజకు వేళ. మేస్త్రీయే '' ఇంటికి తెచ్చుకుంటే నవ్వరా యెలా తెచ్చుకుంటాం'' అన్నదని ఆమెతోడు దొంగ తోడి కోడలు చెప్పింది. ఇప్పుడిలా ప్లేటు ఫిరాయించింది గడుసు మేస్త్రీ. ఊసరవెల్లి స్టైల్.

''మీదంతా హాస్యం. మీ ముఠా వాళ్లు మా తల్లిగారికి డబ్బు మనిషని పేరు పెట్టారు. అది నిక్‌నేమ్ కాదు. నిజమైన నేమేనని ఋజువైంది'' అన్నా వచ్చినామె వెళ్లిపోయింది.

వీధిలోకొస్తే, పోస్టుమాన్ నాటుబాంబులాంటి వుత్తరం విసిరేసి వెళ్లిపోయాడు. పైనపేరు నాది. హాండ్‌రైటింగ్ ఆఫీసరుది. చింపి చదివా'' ఇక్కడ క్రైసిస్ వచ్చింది. అది తోడు దొంగలంతా కూడి తెచ్చిందేమోనని తేలింది. నన్నిలాంటి చోటుకి వేశారని విచారంగా వున్నది. ఉన్న ఆపీసరూ ఛార్జి యివ్వనంటున్నాడు. ప్రభుత్వంతో తగాదా పడ్డాడు. వారు బలవంతంగా రిటైర్ చేయించాలని ప్రయత్నిస్తున్నారు. రిటైరూ కానంటున్నాడు. భీష్ముడంటి ఆఫీసర్నేమీ చేయలేక నన్ను శలవుపెట్టమన్నారు. వారు రాజీపడాలట భీష్మునితో. కిరాయి నాటకులు, కిరాయి ముట్టితేనేగాని రంగు పూసుకుని రంగంమీదకి వస్తామంటారుట మునుపు. అలావున్నది నాటకం. ఒక నెల సెలవు శాంక్షన్ చేశారు. నువ్వక్కడే వుండు. నిన్ను బాగానే చూస్తున్నారు మా ముఠా వాళ్లు. నువ్వు వాళ్లకి నచ్చావు. కలుపుగోలుతనంగా వుండు. పూసుకు తిరుగు. గతం నాస్తి అనుకో''.

''నెలరోజులే అని భయం వేసింది. పారిపోదామా అనిపించింది. ఈ ముఠాలో దూరి, నేనూ తోడుదొంగని కావాలా? వీరి కుట్రలు నేర్వాలా? వుడాయించాలి. యే మేస్త్రీ నన్ను పెంచిందో ఆ మేస్త్రీ వద్దకే పోయి యీ చాకిరీ మాటలూ చేస్తూ విందాం. ఇక్కడ భరించేవి అక్కడే భరిద్దామనుకుని, పిల్లల్ని పిలిచి, పెట్టె అందుకుని వాకిట్లో కొచ్చా. ముఠా మేస్త్రీ వేపు వారొక జట్కాలో వచ్చి దిగారు. నేనాలస్యం చేయకుండా పిల్లల్ని యెక్కించి పెట్టె పడేసి నేనూ యెక్కా.

ముఠామేస్త్రీ వచ్చింది. ''వెళ్లిపోతున్నావేం? నేనేమనలేదే? నా మనమరాలికి కుంకుమ పసుపు యివ్వాలి. అన్నీ నీ చేత చేయిద్దామనుకున్నా. అది సుఖప్రసవం అయి కొడుకునెత్తుకోవాలి. రెండో మనమడికి మూడు పోగులు వేయించాలని

ముహూర్తం పెట్టించా. అదీ నీ చేతిమీదిగానే జరగాలి. దులపరించుకుని వెళ్లిపోతున్నావేం? ఇది నీ యిల్లనుకోవూ? మీ ముఠాస్వభావాలేం బైటబెట్టావే? లేడికి లేచిందే పరుగని పోతున్నావే? ఒంటెత్తు గుణం'' అంటున్నది మేస్త్రీ. దొంగనవ్వూ నడ్డిన చేయీ తడిబట్టా.

''తోడుదొంగ వచ్చాక, ఆయన డబ్బు రాలిస్తే, అవన్నీ చేయిస్తా నా చేతిమీదుగా మేస్త్రీగారూ'' అని జట్కావాలా ఖాశిం వంకచూసి ''పోనీస్టేషను'' అన్నా. జట్కావాలా కొరడా ఝళిపించాడో లేదో గుఱ్ఱం దౌడు తీసింది. ముఠా మేస్త్రీ ఈజిప్ట్ కథలో ఫారాలాగా కనిపించింది.

3

హాస్యప్రియ చప్పట్లు కొట్టి పకాపకనవ్వి ''థ్రిల్లర్‌లాగా కొద్దిగా స్టంటులాగా వున్నది నేరేషన్'' అన్నది. ''కానీ మరి ఇంటర్వల్ వరకు వచ్చాం'' అని లేచిపోయి స్నాకూ్స, టీ, బిస్కట్సూ తెచ్చి యెదురుగా పెట్టింది.

వాటిని పూర్తి చేస్తూ దయావతి, ''పోనిద్దూ ప్రియా, కొత్తేమున్నది. అందరి జీవితాల్లో వుంటాయి థ్రిల్లర్సు స్టంట్సూ'' ప్రియా ఒప్పుకోలేదు. ''వంటవేళ కాలేదు. తోడుదొంగా రాలేదింకా. వినిపోతా. నాకూ పని వున్నదింటి దగ్గర. ఆ దెబ్బతో ముఠామేస్త్రీ వదిలిపోయిందా'' అన్నది నవ్వుతూ టీ చప్పరిస్తూ.

''లేదు లేదు. అదే భ్రమ. ముఠా మేస్త్రీ తన తోడుదొంగ సాయంతో నన్ను తన చేతికింద పెట్టుకుని అణిచివుంచాలనే ఆలోచన మానుకోలేదు. అక్కడ క్రిసిస్ జటిలమైతే నెల ముగిసిందని గమనించి మరో జిల్లా వేశారాఫీసర్ని. తీసికెళ్లాలని వస్తే నేను పిల్లలూ కనబడలేదు ముఠాలో. నమ్మేవాడొచ్చాడని ముఠా మేస్త్రీ నా మీద నిందలు మోపింది. '' ఉండు. నీకూ నీ పిల్లలకు నీ వాళ్లు యింత తినేందుకు పెట్టలేరు. నా దగ్గరే వుండు. ఇక్కడే వుండి పోరాలేదు గదా. తోడుదొంగ వచ్చి తీసికెళ్తాడెలాగూ'' అన్నారా నాయనా! వింటేనా? తూస్కారంగా మాటలని వెళ్లింది. ఇంకా దాని చేతిమీదుగా యెన్నో చేయిద్దామనుకున్నా. నేనిచ్చే పెద్దరికం గౌరవం అక్కర్లేదని విదిలించి

వెళ్లిపోయింది. బొత్తిగా గౌరవమే లేదు ఆఫీసరుగారి తల్లని'' అని ఆపింది దయావతి.

''నమ్మాడా తోడుదొంగ ఆఫీసర్?'' ట్విస్టుబావున్నట్టు చూసింది హాస్యప్రియ.

''నమ్మే వుండచ్చు. ఉగ్రనారసింహుడై'' బొత్తిగా గౌరవము లేదు మా ముఠా మీద'' అనుకుని పళ్లు పటపట లాడిస్తూ వచ్చాడు మా ముఠా మీదికి అక్కడా కంటబడలేదు నేను. మా ముఠా వారేం నోట్లో నాలుకలేని వారు కారు. నా మీద నిందలేపి, తమ నిర్దోషిత్త్వం దయాగుణం విశదీకరించి, ''కోరింత దగ్గు పట్టుకున్నది బిడ్డలకి. జ్వరం వాంతులూ వెళ్లకు. ఇప్పుడప్పుడే తగ్గదా కోరింత దగ్గు'' అంటే మమ్మల్ని ఖాతరు చేయక, అదెవత్తో డాక్టరమ్మ, హైస్కూలులో వుండగా క్లాసువేటుట, అదిపుడు నర్సింగ్ హోమ్ నడుపుతున్నదట, మన కులమూ గాదు సరిగదా మతము వేరే. మేరియాట పేరు. మన కులస్థుడిని డాక్టర్ని పెళ్లాడిందట. అది రమ్మంటే దాని వెంటబడి పిల్లల్నీ తీసుకుని వెళ్లిపోయింది'' అన్నారు. మా ముఠా తోడుదొంగలు. ఇల్లంతా తిరిగి చూశాడాఫీసరు. ఒక బిడ్డనన్నా వదిలేసి వెళ్లిందేమోనని. యెలుకలు పరుగులు తీస్తున్నాయి. అటకమీద యెండుగడ్డి కూరి వున్నది. దానిలోంచి పాంపిల్ల తొంగిచూస్తున్నది. చిన్నదొడ్డి. ఆవూ దూడా, పేడా పంచితం గొడ్ల వద్ద శుభ్రత లేదు. ముఠాలోని తోడు దొంగ ఒకడు. పాలిపోయి వెలవెలపోతున్న ఆఫీసర్ని చూసి జాలిపడి మేరియా అడ్రస్ చెప్పాడు. థాంక్సు చెప్పి బయల్దేరాడాఫీసరు. కల్లుతాగిన కోతిలాగా వచ్చి పడ్డాడు నేనున్నచోటికి. నాలుకకి స్వేచ్ఛ యిచ్చాడు. ''నిన్నెవడు రమ్మన్నాడిక్కడికీ? తిండీ తీర్థం చూస్తారా'' అని వురిమి కనులెర్ర బడేసుకున్నాడు తోడుదొంగ ఆఫీసరు.

మేరియా ''తగ్గు తగ్గు ఆఫీసర్, ఆమె రానన్నది. వెతుక్కుంటాడీ ముఠాలోని తోడుదొంగ. పిల్లల్ని దత్తు యిస్తుందో, అమ్ముతుందోనని భయం. నేను పెంచలేనుగదా డాక్టర్!'' అన్నది. అది హ్యూమర్ ఆఫీసర్. మీ ముఠావాళ్ల

సైకాలజీ తెలుసునో తెలియదో మీకు ఆఫీసర్. లేక మీది బ్లైండ్ లవ్ అయి వుండాలి ఆఫీసర్. తాత మామ్మా అందర్లోకీ పెద్దముండా అని పిలుస్తూ, చాకిరీ చేయిస్తూ డబ్బు బైటికి తీయ్ ''అనే ముతా మేస్త్రీకి వెరవాలా ఇంట్లో యింకెవరూ పెద్దముండలు లేరా. వారి డబ్బు బయటికి తీయించలేదా మేస్త్రీ. మా ముతా వారందరికీ పదమూడోయేడే. యెదగలేదేమో. ఆమె ముతావారూ తక్కువ తినలేదు. ఇంట్లో ముతాకు సంబంధించినదే మెంటల్ రెక్. ఆ రెక్‌ని క్యూర్ చేసే వీలున్నదేమో చూచిరా అని ప్రొఫెసర్ టైటస్, మానసిక వ్యాధుల నర్సింగ్ హోమ్ రన్ చేస్తున్నారు. మీకు సీనియర్ ఆయన. అడ్రస్ యిచ్చి ఛార్జెస్ యిచ్చి పంపితే వెళ్లా. అక్కడ కనిపించింది దయావతి. ''యెందుకు మెంటల్ హాస్పటల్లో పెట్టరు? క్యూర్ చేయాలని వుండదా?'' అన్నా. ''మోసం చేసి నమ్మించి, నయమౌతుందని, మతం మార్పిడీ చేసినా, పెళ్లి చేసినా, లేక జబ్బు చెప్పినా, దాని ఆస్తంతా దాని అత్తవారికి పోతుందమ్మా. పిచ్చిముండనిపేరు పెట్టి భరణమిస్తారంటే. నోట్లో మట్టి కొట్టుకోమంటున్నారా. మేమే భరిస్తున్నాం దాన్నీ దాని జబ్బునూ. మీరు హామీ వుంటరా'' అన్నారు ముతా మేస్త్రీగారు. ''అదంతా జబ్బుగాదమ్మా, కొంత జబ్బే కాని, కసీ, రాగతనం, జెలసీ పెంచుకున్నది. రాగతనం, మాటలే చెపుతాయా స్వభావాన్ని. పోనీ వుధృతం తగ్గించే మందులు వాడారా?'' అన్నా. ''తీసుకోదు. లొంగదు. అవపచ్చుం చేస్తుంది. మరో ముతావారు చాతబడి చేయిస్తే అలా అయింది. అంతకు ముందు మంచిదే. ఆరోగ్యంగానే వున్నది. ఉద్యోగమూ వెలిగిస్తున్నది అన్నం పళ్లెమే మొహాన విసిరేస్తుంది. మందు తింటుంది యమబలం. బలవంతంగా మింగించినా మందు పనిచేసినట్టే కనబడి వ్యవహారం మొదటికొచ్చేస్తుంది. యేమిటి లాభం'' అన్నది మేస్త్రీ.

మానవత చూపటమదేనా! మానవ హక్కులు పరిరక్షణ అదేనా ఆఫీసర్! నీ మగసిరి నా దగ్గర గాదు. నాకు ప్రాణం మీద తీపిలేదు. మొగుణ్ణే అరెస్టు చేయించా. దొంగనోట్ల వ్యాపారం దొంగ సర్టిఫికెట్లు తానిస్తూ మరొకరిచేత

యిప్పిస్తున్నాడు. కాళ్లబేరానికొస్తే విడిపించా యేం చేస్తాడు మొగోడూ, దొంగోడూ, చంపిస్తాడంతేనా! హత్యా పాతకం చుట్టుకుని ముఠావారంతా పాడవుతారు. బి కేర్‌ఫుల్ ఆఫీసర్! డైవోర్సిప్పించే మార్గాలున్నాయి. అంబరాస్ చేస్తున్నాడనేది  పాయింట్. దయావతికి నేనే ట్రెయినింగిచ్చి నా దగ్గర పెట్టుకుంటా. పిల్లలు నీకు చెందరు. దయావతి ఆప్షనల్, సైన్సు సబ్జెక్ట్సే'' అని హైపిచ్డ్ వాల్యూమ్‌లో సెర్మన్ యిచ్చింది మేరియా. శక్తీ కల్ట్ వారిది. వారి దైవము స్త్రీ మూర్తి. మేరీ మాత.

కొంత ఆరోగెన్సూ యిగో తగ్గాయి ఆఫీసర్‌కి. వెరిచినట్లు నటించి, నన్నూ పిల్లల్ని తెచ్చుకున్నారు. బదిలీలు అయీ అయీ యీ వూరు వేశారు ఆఫీసర్ని. కాని స్టిల్ ముఠా మేస్త్రీ అనుయాయే. సీనియర్ తోడుదొంగకీ మద్దతిస్తాడాఫీసర్. కుట్రపన్ని ధర్మపన్నం వల్లించి, ఆఫీసరు మెడలు వంచి నన్ను తన మోచేతినీళ్లు తాగేట్టు చేయాలని చూస్తునే వున్నది. ఔరంగజేబ్ సామ్రాజ్యం కావేరీ వరకు వ్యాపించింది కాని చివరికి అన్నివైపులా రివోల్ట్సు లేచాయి. వృద్ధుడైనాడు. నెపోలియన్ ఓడిపోయిన నాటికి కొద్ది మంది అనుయాయులున్నారు. అలాగే మేస్త్రీకి. సీనియర్ తోడు దొంగ విడోయరైనాడు. మేస్త్రీ జూనియర్ తోడుదొంగా తిమ్మిని బ్రహ్మిని చేసి నన్ను తమ ముఠాలో ఒదిలేస్తే తనూ వాడుకోవచ్చుని, ఒడ్డున బడేసిన చేపను పిల్లి చూసినట్టుంటాయా సీనియర్ తోడుదొంగ చూపులు. ముఠాలో చీలికలు  రివోల్ట్సు లేస్తే విచారం లేదు. లాభమే సీనియర్‌కి'' అని నవ్వుతున్నది దయావతి.

హాస్యప్రియ బాగా నవ్వి ''చాలా బావుంది యెంటర్‌టెయిన్‌మెంట్. థాంక్స్ ఫర్‌ది థ్రిల్లింగ్ స్టోరీ. వస్తాదయా పని యెదురు చూస్తూవుంటుందింటి దగ్గర'' అని గుడ్‌బై చెప్పివెళ్లిపోయింది ప్రియ.